

మదర్ విజయా పాల ప్యాకెట్‌ను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

మార్కెట్‌లోకి మదర్ విజయా పాలు

హయత్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం (మదర్ డెయిరీ) ఆధ్వర్యంలో కొత్తగా మార్కెట్‌లోకి మదర్ విజయా పాల ప్యాకెట్లను విడుదల చేశారు. శనివారం హయత్‌నగర్‌లోని మదర్ డెయిరీ కార్యాలయంలో మదర్ విజయా పాల ప్యాకెట్‌ను డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి, డైరక్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీకర్‌రెడ్డి మాట్లాడుతూ పాడి రైతుల సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్‌లో పాల వ్యాపారానికి ఉన్న పోటీని తట్టుకునే విధంగా కొత్త రకంగా పాలను ప్యాకింగ్ చేస్తున్నామని తెలిపారు. రైతుల నుంచి సేకరించిన పాలను తక్కువ సమయంలో వినియోగదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన పాలను అందించడంలో మదర్ డెయిరీకి పోటీ లేదని అన్నారు. కార్యక్రమంలో మదర్ డెయిరీ ఎండీ కృష్ణ, డైరక్టర్లు జలంధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, జయశ్రీ, ఉప్పల వెంకట్‌రెడ్డి, డీజీఎంలు దివాకర్, శివకుమార్, ఏజీఎం జీవీఎన్ రెడ్డి, ఏవో గఫార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను పునరుద్ధరించాలి

కొత్తపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కోడ్ కారణంగా కొత్తపేట డివిజన్‌లో ఆపిన అభివృద్ధి పనులను పునరుద్ధరించాలని కార్పొరేటర్ పవన్ కుమార్ శనివారం అధికారులను ఆదేశించారు. మారుతీనగర్‌లో డ్రైనేజీ పైప్ లైన్ పనులు పునరుద్ధరించిన ప్రాంతాన్ని జలమండలి జేటీఓ ఆరిఫ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల వారికి ఇబ్బందులు తలెత్తకుండా పనులు ముగిసిన వెంటనే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు.



గీత కార్మికుడి కుటుంబసభ్యులకు సాయం అందజేస్తున్న కౌండిన్య అసోసియేషన్ వాలంటీర్లు

గీత కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం

అబ్దుల్లాపూర్‌మెట్, మే 18 (ఆంధ్రజ్యోతి): మృతి చెందిన గీత కార్మికుడి కుటుంబానికి కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ఆధ్వర్యంలో శనివారం సాయం అందించారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మజీద్‌పూర్ గ్రామానికి చెందిన గండేటి తేజ ఈ నెల 15న తాటిచెట్టుపై నుంచి జారి పడడంతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ పరిస్థితిని బాటసింగారం గ్రామానికి చెందిన మోడెపు యాదగిరిగౌడ్ కౌండిన్య అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. దాంతో అసోసియేషన్ వాలంటీర్లు నాతి పాండు, రాఘవేంద్ర, గణేష్, అజయ్‌కుమార్‌గౌడ్ శనివారం మజీద్‌పూర్‌లో మృతుడి కుటుంబ సభ్యులకు రూ. 20 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక గీత కార్మిక సంఘం అధ్యక్షుడు అంజయ్య, నర్సింహ, దర్శన్, మల్లేష్, రాములు, వెంకటేష్, జగన్, వెంకటేష్, నగేష్, శివశంకర్, నర్సింహ, పరమేష్ పాల్గొన్నారు.

కృష్ణవేణి ఆస్పత్రి రోడ్డు కబ్జాపై పరిశీలన



రోడ్డును కొలుస్తున్న అధికారుల బృందం

హయత్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్ బస్ డిపో రోడ్డులో కృష్ణవేణి ఆస్పత్రి యాజమాన్యం రోడ్డును ఆక్రమించిందని శ్రీనివాస కాలనీ సంక్షేమ సంఘం, పలు కాలనీల వారు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశంతో శనివారం జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్, హయత్‌నగర్ మండల రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖ అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు, పలువురు న్యాయవాదులు, పోలీసులు ఆక్రమణకు గురైన ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం హయత్‌నగర్‌లోని 14వ అదనపు కోర్టు జడ్జి సల్మా ఫాతిమా సమక్షంలో కేసుకు సంబంధించిన జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్, కృష్ణవేణి ఆస్పత్రి తరపు న్యాయవాదులు వాదనలు వినిపించారు.

పెన్షనర్లకు ఉచితంగా కంటి పరీక్షలు

చాదర్‌ఘాట్, మే 18 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలోని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి వైద్యులు పెన్షనర్లకు శనివారం ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు అధ్యక్షుడు మారం భరత్‌రెడ్డి అధ్యక్షతన అసోసియేషన్ నెలవారీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సెక్రటరీ జనరల్ చోళ ఓం ప్రకాష్‌యాదవ్, అసోసియేట్ ప్రెసిడెంట్ మదన్‌మోహన్‌రావు, కోశాధికారి జి.ప్రసాదరావు పరీక్షలు చేయించుకున్నారు. ఈహెచ్ఎస్ మేనేజర్ మహేందర్, మాక్స్‌విజన్ ఆస్పత్రి మార్కెటింగ్ అసిస్టెంట్ మేనేజర్ మహేష్ పాల్గొన్నారు.

జలమయమైన రహదారులు

- జాతీయ రహదారిపై రాకపోకలకు అంతరాయం
- చెరువును తలపిస్తున్న చింతలకుంట ప్రధాన రహదారి
- పలు కాలనీల్లో చేరిన వరదనీరు... పొంగి పొర్లిన డ్రైనేజీలు



బీఎన్‌రెడ్డినగర్, పద్మావతి కాలనీలో చేరిన వరదనీరు



ఆటోనగర్ డీర్ పార్క్ వద్ద జలమయమైన రహదారి

వనస్థలిపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలతో పాటు రహదారులు జలమయమయ్యాయి, వర్షపునీరు చేరడంతో విజయవాడ జాతీయ రహదారి చెరువును తలపించింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడారు. చింతలకుంట, పనామ, హైకోర్టు కాలనీ, భాగ్యలత వద్ద వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. మున్సిపల్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. మన్సూరాబాద్ డివిజన్‌లోని లోతట్టు ప్రాంతాలైన అనితనగర్, సెంట్రల్ బ్యాంక్ కాలనీ, సాయినాథ్ కాలనీ, హిమపురి కాలనీలు, వనస్థలిపురంలోని శ్రీకృష్ణనగర్, జాంగీర్ నగర్, పద్మావతి నగర్, వెంకటరమణ కాలనీ, క్రిస్టియన్ కాలనీ, శారదానగర్, నర్సింహారావు నగర్, బీఎన్‌రెడ్డినగర్‌లోని గౌతమీనగర్, సాహెబ్‌నగర్ వీకర్ సెక్షన్ కాలనీ, పద్మావతి నగర్, వైదేహినగర్, సాగర్ కాంప్లెక్స్, స్నేమమాయి నగర్, గాయత్రీనగర్, బృందావన్ మీడోస్, శివారు కాలనీల్లో వరదనీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. కామినేని ఆస్పత్రి సమీపంలోని రహదారిపై డ్రైనేజీలు పొంగిపొర్లాయి. నాగోల్ డివిజన్‌లోని మమతనగర్, బండ్లగూడ, అయ్యప్పకాలనీల్లో వరదనీటితో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. మన్సూరాబాద్-బండ్లగూడ రోడ్డులో వర్షపునీరు నిలిచింది. మున్సిపల్ సిబ్బంది మ్యాన్‌హోల్స్‌ను ఓపెన్ చేసి నీటిని తొలగించారు.

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో సుమారు గంట పాటు కుండపోత వర్షం కురవడంతో రహదారులు జలమయమయ్యాయి. వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. చంపాపేట చౌరస్తాలోని సాగర్ ప్రధాన రహదారి నీటితో నిండిపోయింది. వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. ఎస్‌జీఆర్‌కాలనీ, రెడ్డికాలనీ, దుర్గాభవానీనగర్ కాలనీలోని రహదారులు వరద నీటితో నిండిపోయాయి. హస్తినాపురం డివిజన్‌లోని పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.

సైదాబాద్ : మాదన్నపేట మార్కెట్‌లో చెత్త తరలింపు నిలిచిపోవడంతో వర్షం కారణంగా కుళ్లిన వ్యర్థాలు కొట్టుకువచ్చి దుర్గంధంగా మారింది.

చాదర్‌ఘాట్ : మలక్‌పేటలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ముసారాంబాగ్ బ్రిడ్జి వరద నీటితో నిండిపోయి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగగా ట్రాఫిక్ సిబ్బంది మ్యాన్‌హోళ్లను శుభ్రం చేశారు. న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ కింద భారీగా నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. మలక్‌పేట అక్షయ్ హోటల్ ముందున్న మ్యాన్‌హోల్‌ను ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. వాహనాదారులు ప్రమాదాలకు గురికాకుండా బారికేడ్ ఏర్పాటుచేశారు. మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరద నీరు భారీగా చేరడంతో వాహనాలు ముందుకు కదలలేకపోయాయి.

హయత్‌నగర్ : హయత్‌నగర్‌లో భారీ వర్షం కురిసింది. బీడీఎల్ కాలనీ, అరుణోదయనగర్, రాఘవేంద్రనగర్ కాలనీ మీదుగా భారీగా వరద వచ్చింది. హయత్‌నగర్ ఫైర్‌స్టేషన్, విద్యుత్ సబ్‌స్టేషన్ మధ్యలో వరద నిలిచి చెరువును తలపించింది. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. వర్షం కారణంగా విజయవాడ జాతీయ రహదారిపై రాక పోకలకు ఇబ్బంది కలిగింది.

అబ్దుల్లాపూర్‌మెట్ : పెద్దఅంబర్‌పేట్, అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో శనివారం సాయంత్రం కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.



చింతలకుంట వద్ద జలమయమైన జాతీయ రహదారి



చింతలకుంట వద్ద జాతీయ రహదారి జలమయం కావడంతో వాహనదారులు, బాటసారుల ఇక్కట్లు



మన్సూరాబాద్-బండ్లగూడ రోడ్డుపై వర్షపునీరు వచ్చి చేరడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు



చింతలకుంట వద్ద నీటిలో కొట్టుకుపోతున్న ద్విచక్రవాహనం

కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు

- విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్

చంపాపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ ఇన్నోవేషన్ దిశగా కమ్యూనికేషన్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చినట్లు ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ అన్నారు. ప్రపంచ టెలికాం దినోత్సవాన్ని (బీఎస్ఎన్ఎల్) పురస్కరించుకొని హస్తినాపురం డివిజన్ సాగర్ రోడ్‌లోని ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆకృతి కార్యాలయంలో శనివారం ఆ సంస్థ చైర్మన్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బి.చంద్రకుమార్ హాజరయ్యారు. టెలికాం రంగంలో 35 సంవత్సరాలు సేవలందించిన మాజీ ఉన్నతధికారి జి.వెంకటేశ్వర్లును ఘనంగా సన్మానించారు. అనంతరం చంద్రకుమార్ మాట్లాడుతూ టెలికాం వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగంలో కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ఆకృతి చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ కమ్యూనికేషన్ రంగంలో సాంకేతికత పెరిగినా, సైబర్ నేరాల సంఖ్య పెరుగుతుండటం ఆందోళన కల్గించే అంశమన్నారు. కార్యక్రమంలో జీవీఎస్.కిరణ్, బీఎస్ఎన్ఎల్ మాజీ అధికారులు రమేష్‌బాబు, శరణ్యాచార్యులు, ఎస్ఎస్.శాస్త్రి పాల్గొన్నారు.



బీఎస్ఎన్ఎల్ మాజీ అధికారి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్

యువతి అదృశ్యం



శ్రీతల్

అబ్దుల్లాపూర్‌మెట్, మే 18 (ఆంధ్రజ్యోతి): అనాజ్‌పూర్ గ్రామంలో నివాసముంటున్న ఓ యువతి కనిపించకుండాపోయింది. మహారాష్ట్రలోని ముత్కేడ్ మండలం బరాద్ గ్రామానికి చెందిన పతికేర్ దీపక్ కొంతకాలంగా భార్యాపిల్లలతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ గ్రామంలో నివాసముంటున్నాడు. ఇతడి కూతురు శ్రీతల్ (18) ఇంటర్ వరకు చదివి ఖాళీగా ఉంటుంది. ఈ నెల 14న రాత్రి 7 గంటల సమయంలో ఇంట్లో చెప్పకుండా బయటకి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో దీపక్ శనివారం అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హయత్‌నగర్‌లో మంగళసూత్రం అపహరణ

హయత్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): టీవీఎస్ మోపెడ్‌పై వెళుతున్న మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు మంగళసూత్రాన్ని దుండగులు లాక్కెళ్లారు. బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన జెల్ల లక్ష్మమ్మ శుక్రవారం సాయంత్రం హయత్‌నగర్‌లోని భాగ్యలత శాంతినగర్‌లో వారాంతపు సంతలో కూరగాయలు అమ్మి భర్త శ్రీశైలంతో కలిసి టీవీఎస్ మోపెడ్‌పై రాత్రి 9.30 గంటలకు ఇంటికి వెళుతుండగా బ్రాహ్మణపల్లి పౌల్ట్రీఫారాల వద్ద గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెనుక నుంచి వచ్చి లక్ష్మమ్మ మెడలోని మంగళసూత్రాన్ని లాక్కుని పారిపోయారు. ఈ క్రమంలో లక్ష్మమ్మ మోపెడ్‌పై నుంచి కిందపడి గాయపడింది. బాధితురాలి ఫిర్యాదుతో హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేసుల పరిష్కారానికి చొరవ చూపాలి

రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి శ్రీదేవి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, మే 18 (ఆంధ్రజ్యోతి): పారా లీగల్ వాలంటీర్లు కేసుల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి శ్రీదేవి అన్నారు. శనివారం న్యాయసేవాసదన్‌లో పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాలంటీర్లు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజల్లో చట్టాల పట్ల అవగాహన కల్పిస్తూ కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పారా లీగల్ వాలంటీర్లు విజయలక్ష్మి, రజనీదేవి, లలిత పాల్గొన్నారు.

కనువిందు చేసిన ఇంద్రధనస్సు



అబ్దుల్లాపూర్‌మెట్ వద్ద శనివారం సాయంత్రం వర్షం కురిసిన అనంతరం ఆకాశంలో ఇంద్రధనస్సు ఇలా కనువిందు చేసింది. చాలా రోజుల తర్వాత ఇంద్రధనస్సు కనిపించడంతో ప్రజలు పెద్ద ఎత్తున ఫొటోలో దాన్ని బంధించారు.
(అబ్దుల్లాపూర్‌మెట్, ఆంధ్రజ్యోతి)

నకిలీ డాక్యుమెంట్‌తో ప్లాట్ రిజిస్ట్రేషన్... వ్యక్తి అరెస్ట్

వనస్థలిపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ డాక్యుమెంట్‌తో ప్లాట్‌ను తన పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బషీర్‌బాగ్‌కు చెందిన ఎం.రవీందర్ రెడ్డి 2007లో బ్యాంక్ వేలం ద్వారా చింతలకుంటలో 2 వేల గజాల ప్లాట్‌ను కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. పీర్జాదిగూడ గ్రామం బుద్దనగర్‌కు చెందిన గవిని చెన్నారెడ్డి (70) ఆ ప్లాట్‌ను కబ్జా చేసి నకిలీ పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయించుకుని వేరే వ్యక్తికి విక్రయించాడు. రవీందర్ రెడ్డి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడిపై గతంలో పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.


గ్రేటర్ రోడ్లపై ఆర్టీసీ డ్రైవర్లు రయ్‌రయ్

- ర్యాష్ డ్రైవింగ్‌తో వాహనదారులను హడలెత్తిస్తున్నవైనం
- ఉదయం, రాత్రి వేళల్లో అతివేగంగా దూసుకెళ్తున్న బస్సులు

హైదరాబాద్‌సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ రోడ్లపై కొందరు ఆర్టీసీ బస్సు డ్రైవర్లు ర్యాష్‌డ్రైవింగ్‌తో దూసుకుపోతూ వాహనదారులను హడలెత్తిస్తున్నారు. ముఖ్యంగా ఉదయం, రాత్రి వేళల్లో ప్రధాన రహదారులపై ర్యాష్ డ్రైవింగ్‌తో బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రయాణికులు బస్సులు దిగకముందే బస్సులు ముందుకు కదలడంతో బస్సుల నుంచి దిగలేక ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్, బస్టాపుల వద్ద అతివేగంగా బస్సులు నడుపుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రేటర్ జోన్‌లో ఆర్టీసీ 2,800 బస్సులతో రోజూ 30 వేల బస్సు ట్రిప్పులు నడుపుతోంది. ప్రధాన రహదారులపై ఉదయం ట్రాఫిక్ తక్కువగా ఉండటంతో కొందరు డ్రైవర్లు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఆపకుండా వెళ్తున్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. రద్దీ సమయాల్లో బస్టాపుల్లో బస్సులు ఆపకుండా రోడ్ల మధ్యలో నిలపడం వల్ల వెనుకవచ్చే వాహనదారులు బస్సులకు తాకి ప్రమాదాలకు గురవుతున్నారు. గచ్చిబౌలి, కూకట్‌పల్లి, మియాపూర్, జూబ్లీహిల్స్, ఉప్పల్, ఈసీఐఎల్, కొండాపూర్, జీడిమెట్లతో పాటు శివారు ప్రాంతాల్లో ఉదయం వేళల్లో కొందరు డ్రైవర్లు అతివేగంగా బస్సులు నడుపుతున్నారంటూ ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కాగా ర్యాష్ డ్రైవింగ్‌కు సంబంధించిన ఫిర్యాదులను ఆర్టీసీ సీరియస్‌గా పరిగణిస్తుందని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ప్రయాణికులకు అందిస్తున్న సేవలపై ఈడీ స్థాయి అధికారులతోపాటు డిపో మేనేజర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించేలా ఆర్టీసీ చర్యలు తీసుకుంటోంది. బస్టాప్‌ఎలో బస్సులు నిలపకపోయినా, వేగంగా బస్సులు నడిపినా బస్సు నంబర్, సమయపాలన వివరాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

నకిలీ డిగ్రీ సర్టిఫికేట్స్ విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మే 18 (ఆంధ్రజ్యోతి): నకిలీ డిగ్రీ సర్టిఫికెట్స్ తయారు చేసి, మార్కెట్లో విక్రయిస్తున్న ఇద్దరిని రాచకొండ ఎస్వోటీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన పలు సర్టిఫికేట్స్ స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెహిదీపట్నంకు చెందిన మహ్మద్ అబ్రార్ హుస్సేన్ ఓ కన్సల్టెన్సీ లో పనిచేస్తున్నాడు. విదేశాల్లో ఉద్యోగాలకోసం, ఉన్నత చదువులకోసం వెళ్లేవారికి వీసా మంజూరవడానికి డిగ్రీ సర్టిఫికేట్స్ అవసరమైన కస్టమర్స్ వివరాలు కన్సల్టెన్సీ ద్వారా తెలుసుకుంటాడు. తనకు ఫొటో షాప్‌లో అనుభవం ఉండటంతో నెట్‌లో వివిధ రకాల యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికెట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకొని వాటిలోని అంకెలను మార్చేసి, అలాంటిదే నకిలీ సర్టిఫికెట్స్‌ను తయారు చేస్తాడు. అవసరమైన కస్టమర్స్‌కు ఒక్కో సర్టిఫికేట్ కన్సల్టెన్సీలతో కలిసి రూ. 30-40వేలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ క్రమంలో లంగర్‌హౌజ్‌కు చెందిన సయ్యద్ ఇన్‌స్సైన్ మహ్మద్‌కు డిగ్రీ సర్టిఫికెట్ అవసరం అవడంతో అబ్రార్ హుస్సేన్ సంప్రదించాడు. ఈనెల-16న చైతన్యపురి లిమిట్స్‌లో అతని సర్టిఫికెట్ అందజేయడానికి వెళ్లగా సమాచారం అందుకున్న రాచకొండ మహేశ్వరం ఎస్వోటీ పోలీసులు చైతన్యపురి పోలీసులతో కలిసి ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి వివిధ యూనివర్సిటీలకు చెందిన సర్టిఫికేట్స్ ఒక ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు.



ఫేక్ సర్టిఫికేట్స్‌తో పోలీసులకు చిక్కిన నిందితులు

భక్తిశ్రద్ధలతో వాసవీమాత జయంత్యుత్సవాలు

సరూర్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాలను శనివారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. బడంగ్‌పేట్ శివనారాయణపురం కాలనీలోని కాశీబుగ్గ క్షేత్రంలో నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహా రెడ్డి పాల్గొన్నారు. ఆర్యవైశ్య సంఘం బాలాపూర్ మండల శాఖ అధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్‌గుప్తా, బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు టి.శ్రీనివాస్‌గుప్తా, కార్యవర్గ సభ్యులు రామ్మూర్తి గుప్తా, వెంకటేశ్వర్లుగుప్తా, వీరబ్రహ్మం గుప్తా పూజల్లో పాల్గొన్నారు. వాసవీనగర్ కాలనీలో నిర్వహించిన ఉత్సవాల్లో బడంగ్‌పేట్ నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహా రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. కాలనీ ప్రతినిధులు శ్రీనివాస్, రవీందర్‌కుమార్, రాములు, రాఘవేందర్, విజయకుమార్ పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట : కొత్తపేట వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో జరిగిన పూజల్లో పుష్పగిరి పీఠాధిపతి విద్యానంద శంకర భారతీ స్వామి పాల్గొన్నారు. కుంకుమార్చన పూజల్లో రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ పూర్వ అధ్యక్షులు కోలేటి దామోదర్, గడ్డిఅన్నారం ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఎంఎల్‌ఆర్ గుప్త పాల్గొన్నారు. కొత్తపేటలో జరిగిన వేడుకల్లో టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ కార్య నిర్వాహక అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గుప్త, అధ్యక్షులు ఎంఎల్‌ఆర్ గుప్త, ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు ఉపేందర్, ఎస్‌టీఆర్ కృష్ణ, ఎల్‌వీ.కుమార్, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు. న్యూ నాగోల్ వాసవీ మాత సేవా సమితి అధ్వర్యంలో సీటీఓ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ పవన్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం 350 మందికి అన్నదానం చేశారు. సమితి అధ్యక్షులు గుండా రామకోటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి పచ్చిపులుసు శ్రీనివాస్ రావు, ఉపాధ్యక్షులు భూశెట్టి రమేష్, కోశాధికారి మోతుకూరి రమేష్, సంయుక్త కార్యదర్శి పాటిశెట్టి మధు పాల్గొన్నారు.



కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకల్లో పాల్గొన్న టీపీసీసీ ప్రచార కమిటీ కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్ గుప్త

వనస్థలిపురంలో..

వనస్థలిపురం : మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్ కాలనీ ఫేస్-1 కమ్యూనిటీహాల్లో వాసవిమాత జయంతి వేడుకలు మురిశెట్టి సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తపస్వి నాట్యమండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వాసవీక్లబ్ కార్యదర్శి భాస్కర్ లింగమయ్య, కోశాధికారి అంజిబాబు, విశ్వనాథం, అరవింద్, వెంకటరమణ, రామణ, రాజీవ్‌కుమార్, అనిల్, గోపి, శ్రీనివాస్, స్వర్ణలత పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో..

హయత్‌నగర్ : హయత్‌నగర్‌లోని అయ్యప్ప దేవాలయ ప్రాంగణంలోని వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. వాసవీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు

అబ్దుల్లాపూర్‌మెట్‌లో..

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారంలోని వాసవీ సాయి శ్రీనివాస ఆలయంలో కుంకుమార్చనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పాల్గొన్నారు.

చంపాపేట : చంపాపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సాగర్‌రోడ్‌లోని సంఘం కార్యాలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన, పారాయణం, గోపూజ నిర్వహించారు. లక్కారపు సుందరయ్య సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. చంపాపేట ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఊరే రవీందర్‌గుప్తా, ప్రధాన కార్యదర్శి బచ్చు మహేష్‌గుప్తా, అడిషనల్ సెక్రటరీ ఊరే మధుసూదన్‌గుప్తా, అమావాస్య అన్నదాన కమిటీ అధ్యక్షుడు ఇడుకుల విజయనాథ్‌గుప్తా, కోశాధికారి రమణయ్యగుప్తా, సభ్యులు ఉలకుర్తి జగన్‌గుప్తా, రాములు గుప్తా, ముప్పారపు బాలరాజు, చీకటిమల్ల లోకేష్ గుప్తా, చిత్తలూరి నరేష్‌గుప్తా, ఊరే రవీందర్‌గుప్తా, బచ్చు మంజుల, మహిళా అధ్యక్షురాలు గీత, లత, గంప పద్మ, బీకుమాండ్ల మంజుల, గజవాడ సరిత, స్థలదాత బెల్దే గురుమూర్తి, బచ్చు వెంకయ్యగుప్తా, చంద్రశేఖర్‌గుప్తా పాల్గొన్నారు.



బడంగ్‌పేట్ కాశీబుగ్గ క్షేత్రంలో జరిగిన ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ పారిజాతారెడ్డి

చాదర్‌ఘాట్‌లో..

చాదర్‌ఘాట్ : ముసారాంబాగ్ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు రేణికింద దిగంబర్, కార్యదర్శి పబ్బా యుగంధర్, కోశాధికారి గుండ శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కాసన్నగొట్టు వేణుగోపాల్, అసిస్టెంట్ ఆర్గనైజింగ్ సెకటరీ మంకాళి రమేష్, తడకమళ్ల చంద్రమోహన్ అమ్మవారికి సామూహిక కుంకుమార్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.